క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



ముసునూరు: గ్రామ సచివాలయ కన్వీనర్లు వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మండల సచివాలయ కన్వీనర్‌గా నియమితులైన ముసునూరు జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. చింతలవల్లిలో గ్రామ సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో సర్పంచ్ పిల్లి సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడిని ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, గ్రామ కన్వీనర్లు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, ట్వింకిల్ కమలాకర్, వార్డు సభ్యులు, వలంటీర్లు ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

వినగడప(గంపలగూడెం): మండలంలోని వినగడప మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈఓ సోమశేఖర్ నాయక్ సోమవారం వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల, మోడల్ లెసన్ ప్లాన్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎస్‌ఏ-1 పరీక్షల్లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. ఉదయాన్నే అసెంబ్లీ నిర్వహణ తీరును, సమయానికి విద్యార్థుల, ఉపాధ్యాయుల బోధన విధానంలో తగిన మెలుకువలను పాటించి వెనుక బడిన విద్యార్థులకు సరైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన అమలు విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఏజెన్సీ మహిళలను ఆదేశించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోళ్ల పవన్

నూజివీడు: పట్టణానికి చెందిన బీసీ సంఘం యువజన నాయకుడు గోళ్ల పవన్‌కుమార్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఆన్‌లైన్ ఎన్నిక ద్వారా ఎన్నికయ్యారు. గతంలో యూత్ కాంగ్రెస్ కృష్ణా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. గోళ్ల పవన్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పవన్ పేర్కొన్నారు.

రోడ్డు భద్రత పాటిస్తే ప్రయాణం సురక్షితం

ఆర్టీసీ జోన్-2 ఈడీ వెంకటేశ్వర రావు



ఇబ్రహీంపట్నం: రోడ్డు భద్రత పాటిస్తే ప్రయాణం సురక్షితంగా ఉంటుందని ఆర్టీసీ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర రావు అన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం మెయింట్‌నెన్స్‌డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు సంస్థ అభివృద్ధికి చిత్తశుద్ధి, క్రమశిక్షణతో బస్సులు నడపాలన్నారు. బస్సుల నిర్వాహణలో మెకానిక్‌ల పాత్ర కీలకమన్నారు. ఉత్తమ మెకానిక్‌లకు గిఫ్టులు అందజేశారు. డిపో మేనేజర్ ఏ.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని రహదారి భద్రత మన జీవితాలకు రక్షణ అని ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో తలకు హెల్మెట్ లేని వారిని గుర్తించి తలకు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకపోవడం వల ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని, తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవటానికి హెల్మెట్ చాటా అవసరమన్నారు. ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలియజేస్తూ అవగాహన నిర్వహించారు.

ఆదాయ పన్ను పరిమితి పెంచాలి

మైలవరం: రాబోయే కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆదాయ పన్ను పరిమితిని రూ.7 లక్షల వరకు పెంచాలని పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పీ గోపాల్, ఎం.వెంకటేశ్ కోరారు. మైలవరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొత్త పీఆర్‌సీలు, కరోనా ఖర్చులు, జీవన వ్యయం, ధరలు పెరిగినందున ఆదాయ పన్ను పరిమితి పెంచాలని ప్రతిపాదించి కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఏపీజీఎల్ఐ, పీఎఫ్, రీయింబర్స్‌మెంట్ త్వరగా విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

- తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో గాంధీ వర్ధంతి
- గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



తిరువూరులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



గంపలగూడెంలో గాంధీజికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు



మైలవరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నేతలు



జి.కొండూరులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



నూజివీడులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



ముసునూరులో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

తిరువూరు: మూడు నియోజకవర్గాల పరిధిలో గాంధీ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరువూరు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన 2కే రన్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ భీమరాజు, ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఎర్రమాడు ఎంపీయూపీ స్కూలులో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు.

గాంధీ అడుగు జాడల్లో నడవాలి

–మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: గాంధీ అడుగు జాడల్లో నేటి యువత నడవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా సోమవారం ప్రకటన విడుదల చేశారు. భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనకు సత్యం, అహింసలనే ఆయుధాలుగా చేసుకుని, శాంతియుత పోరాటం చేసిన మహోన్నతుడు గాంధీ అన్నారు. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. భారతీయులుగా గాంధీ నమ్మిన సిద్ధాంతాలను ఆచరించినపుడే ఆయనకు మనమంతా ఇచ్చే ఘన నివాళి అన్నారు. మహాత్ముడు కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి జగన్ దేశంలోనే మరెక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు.

గంపలగూడెం: ఆర్యవైశ్య సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి గంపలగూడెం బస్‌స్టాప్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి మండల సంఘం అధ్యక్షుడు నాళ్లా చిన్న సత్యంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య జిల్లా కార్యదర్శి కాజా రవికుమార్, ఉప సర్పంచ్ కొల్లా నాగరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు, మాజీ సర్పంచ్ కె.సత్యంబాబు, సంఘ ప్రతినిధులు నేరెళ్ల ఉమా, కొదుమూరు బుజ్జి, కొల్లా మురళీకృష్ణ, తాటికొండ వాసు, నేరెళ్ల శ్రీకాంత్, దోసపాటి గురునాథరావు పాల్గొన్నారు. ఊటుకూరు గాంధీ సెంటర్‌లో వాసవి, వనిత, కన్యక క్లబ్‌ల ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు.

మైలవరం: గాంధీ వర్ధంతి సందర్భంగా మైలవరం నూజివీడు రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బయన శ్రీనివాసరావు, కాజా మహేష్, నాయకులు జూలకంటి ప్రసాద్, చలవాది మధుసూదనరావు, కల్లూరి కన్నయ్య, జూలూరు ఉమామహేశ్వరరావు, చామర్తి కృష్ణ, మిరియాల జగన్, కేతేపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. చంద్రాల గ్రామ సచివాలయంలో సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ జే. గంగాధర రావు పాల్గొన్నారు. మైలవరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

జి.కొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నూజివీడు: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం గాంధీజీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీడీ రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్‌జోడో యాత్ర ముగింపు సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిమి సాగర్‌కుమార్, పాలడుగు నాగభరత్, విఠల్‌కుమార్, బొందిలి రామ్‌సింగ్, గోపే మురళీ, యార్లగడ్డ ఆంజనేయులు, శౌరికుమార్, చీకటి రాజు, మొగదాటి నాగయ్య, మోచర్ల జయరాజు, దుక్కిపాటి ప్రకాశ్ పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గాంధీ వర్ధంతి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. గాంధీ చూపిన బాటలో మనమంతా నడవాలన్నారు. సత్యం, అహింస ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్య ఉద్యమం నడిపారన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు: మండలంలో పలు గ్రామాల్లో బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ గాంధీ సేవలను కొనియాడారు. లోపూడి ఆశ్వర్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెక్కపల్లిలో మండల కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, బొల్లిన నాగరాజు ఆధ్వర్యంలో పలువురు కళాకారులు గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపర్వ (విస్సన్నపేట): మండలంలోని కొండపర్వ ఎంపీయూపీ పాఠశాలలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. పాఠశాలలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. వారి త్యాగాలను విద్యార్థులకు హెచ్‌ఎం జయరామ్ వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత వైఎస్సార్

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- ఈదులగూడెంలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ



ఈదులగూడెంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: మహనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభివృద్ధి ప్రదాత అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని ఈదులగూడెంలో సోమవారం రాత్రి వైఎస్సార్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం ప్రాంగణమంతా వైఎస్సార్ సీపీ శ్రేణులతో కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ రాజకీయాల్లో తన గురువైన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. రాజశేఖర్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వడంతో భారీ మెజారిటీతో విజయం సాధించానని, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ స్థాపించిన వైఎస్సార్ సీపీలో రెండు సార్లు విజయం సాధించానన్నారు.వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలోనే నూజివీడుకు ట్రిపుల్ ఐటీ వచ్చిందన్నారు. 2014 ఎన్నికల తర్వాత అప్పటి సీఎం చంద్రబాబు నూజివీడుకు వచ్చిన మూడుసార్లు మూడు మొక్కలు నాటారన్నారు. త్వరలోనే నూజివీడుకు సీఎం వైఎస్ జగన్ వస్తారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చెయ్యాలని కోరారు. ఈదులగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, మండల సచివాలయాల కన్వీనర్ నందూరి భాస్కర్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, ఎంపీపీ అనూష ఇసాక్, ఆరేపల్లి రామకృష్ణ, కృష్ణా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమెళ్ల కృష్ణంరాజు,రమేష్, సాంబశివరావు, అత్తి పార్వతి మురళీ, కందుల శ్రీను పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్

- తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి
- అక్కపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



తిరువూరు మండలం అక్కపాలెంలో ప్రభుత్వ సంక్షేమ బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

అక్కపాలెం(తిరువూరు): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నిటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నెరవేర్చారని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని అక్కపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి ఆయా పథకాలు అందుతున్న తీరును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామ వలంటీర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులకు సంక్షేమ పథకాలను సక్రమంగా అందించడానికి కృషిచేస్తున్నారని తెలిపారు. వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అక్కపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేపడతామన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, వైస్ ఎంపీపీ వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి, మునుకుళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెదురు గోపిరెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్, నాగిరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి, తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్.పద్మావతి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో 'స్పర్శ'తో ప్రజలకు వ్యాధిపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈవ్యాధి మైక్రో బాక్టీరియా లేప్రే అను బ్యాక్టీరియా వలన వ్యాపిస్తుందన్నారు. శరీరంపై స్పర్శ లేని రాగిరంగు మచ్చలు, చేతులు, పాదాలలో తిమ్మెర్లు, చెవులు మందంగా మారడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు అన్ని సచివాలయాల్లో అవగాహన దస్సులు నిర్వహిస్తామన్నారు. వార్డు కౌన్సిలర్ బాడిశ నాగరాజకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంపలగూడెం: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రజలు సహకరించాలని గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మ పేర్కొన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ ఒంటిపై స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనికై ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు తగిన మందులను కూడా అందజేస్తారన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు గ్రామాల్లో ఈ విషయమే ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, వలంటీర్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చాట్రాయి: కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారిణి లీనా బెంజిమెన్ అన్నారు. సోమవారం చాట్రాయి సచివాలయంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలుంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దామెర ఉష, వైద్యాధికారి ఏ.శ్రీనివాసరెడ్డి, సీహెచ్‌ఓ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు. నరసింహారావుపాలెం, ఆరుగొలనుపేట, కోటపాడు తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పుచ్చకాయల అప్పిరెడ్డి, విస్సంపల్లి ప్రశాంతి, పరసా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: కుష్ఠు వ్యాధిని అంతమొందించాలంటే దాని నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని వైద్యాధికారి ప్రతాప్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 13 వరకూ స్పర్శ కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధి నివారణ, గుర్తింపు, సర్వేలను పురస్కరించుకుని సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి, వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ స్పర్శలేని, చెమట పట్టని, నొప్పిలేని, మచ్చలుగాని, పొడలుగాని ఉన్నట్లెతై వైద్యాధికారులను సంప్రదించాలని అన్నారు. వైద్య శాఖ, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

సీఐ భీమరాజు



తిరువూరులో మాట్లాడుతున్న సీఐ

తిరువూరు: విద్యార్థులు మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తిరువూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ భీమరాజు అన్నారు. సోమవారం తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండటమే కాక సమాజాన్ని చైతన్య పరచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, శివప్రసాద్, పద్మారావు, వైద్యాధికారి భానుతేజ, వాహినీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మైలవరం: యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సీఐ ఎల్.రమేష్ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ సరదా కోసం ఇటువంటి వ్యసనాలకు బానిసలు అవుతున్నారని పేర్కొన్నారు. వీరు సమాజానికి భారం అవుతారని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, డాక్టర్ ఎం.మహేష్, డాక్టర్ దీపిక ప్రసంగించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గంపలగూడెం: యువత మాదక ద్రవ్యాలకు బానిసలై తమ బంగారు జీవితాలను పాడు చేసుకోవద్దని తిరువూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భీమరాజు రుద్రరాజు తెలిపారు. గంపలగూడెం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తోటమూల విశిష్ట జూనియర్, డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వినియోగం వల్ల అనర్థాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ వి.సతీష్ మాట్లాడుతూ విద్యా సంస్థల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడ్డవద్దని తెలిపారు. గంపలగూడెంపీహెచ్‌సీ వైద్యాధికారి కె.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: నిషేధిత మత్తు ప్రదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. రెడ్డిగూడెం వికాస్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్ద న్నారు. డ్రగ్స్ వాడిన, రవాణా చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యాకలాపాల సమాచారం తెలియజేసేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో షీల్డ్ సాధించిన విద్యార్థులు

తోటమూల(గంపలగూడెం): శాప్ ఆధ్వర్యంలో అంతర్‌జిల్లా స్థాయి అండర్–17 లీగ్ పోటీల్లో గంపలగూడెం మండలం పెద్ద కొమిర శివారు తోటమూల ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు షూటింగ్ బాల్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రేవు శైలజ సోమవారం తెలిపారు. బాపట్ల జిల్లా చీరాల పెరియార్ ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు పీ తిరుమలరావు, ఎం.జయగోపాల్, ఎం.జస్వంత్, హరివరుణ్, టీ వినయ్, కె.నవీన్, జే. మహేష్, బి.సాయి విష్ణుల బృందం రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరికి శాప్ కార్యదర్శి షేక్ కరీముల్లా షీల్డ్, సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతిభకనబర్చిన విద్యార్థుల బృందాన్ని శిక్షణ ఇచ్చిన పీడీ ఎం.రమాదేవిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం.రాజేష్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి సోమవారం చెప్పారు. కర్నూల్‌లో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో రాజేష్ ప్రతిభను కనబరిచి ఈ పతకాన్ని సాధించాడన్నారు. విద్యార్థి రాజేష్‌ను, శిక్షణ ఇచ్చిన పీడీ పి.రవీంద్రను హెచ్‌ఎంతో పాటు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పల్లగాని వెంకటేశ్వర రావు, వైస్ సర్పంచ్ మధు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మైలవరం: ఈ నెల 27 నుంచి 29 వరకు కర్నూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కాంశ్య పతకం సాధించాడు. పాఠశాల విద్యార్థి పీ.కే. వెంకట గణేష్ అండర్–14 ఫాయిల్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబర్చి కాంశ్య పతకం సాధించినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి.రామ్‌ప్రసాద్ తెలిపారు. విద్యార్థి వెంకట గణేష్‌ను వ్యాయామ ఉపాధ్యాయులు కె.వెంకయ్య, జి.మెర్సీ రోజీనాలను, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

పథకాల అమలు తీరు పరిశీలన



మల్లేలలో ఔట్‌రీచ్ సర్వే నిర్వహిస్తున్న వలంటీర్

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరుపై సోమవారం సచివాలయ సిబ్బంది ఔట్‌రీచ్ సర్వే నిర్వహించారు. పెన్షన్లు, ఇతర పథకాలు సకాలంలో అందుతున్నాయా, ఇబ్బందులున్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులై పథకాలు అందని వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ఇన్‌చార్జిఎంపీడీవో నాగేశ్వరరావు పర్యవేక్షణలో మల్లేల, లక్ష్మీపురం, కాకర్ల, మునుకుళ్ల, వావిలాల, కోకిలంపాడు గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించారు. పట్టణంలోని వార్డులో ఔట్‌రీచ్ సర్వే జరిగింది. మండలంలో 15 వేల మందిని సర్వే చేయాలని లక్ష్యంకాగా, 40 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా రవిబాబు

మైలవరం: ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా పీ.రవిబాబు ఎన్నికయ్యారు. మైలవరంలోని ఎస్టీయూ కార్యాలయంలో సోమవారం సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన మండల శాఖ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జీ.వరప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా డి. గోపీనాథ్ ఎన్నికయ్యారు. ఉత్తమ ఎంఈఓ అవార్డు పొందిన పీ.రత్నశ్యామ్ బాబును ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ అభివృద్ధికి కృషి చేసిన మండల నాయకులు కే.ప్రభుకుమార్, డి.గోపీనాథ్, ఎస్కే జాఫర్, ఎం. కళామణి, ఎం.బసవయ్యలను సన్మానించారు. ఏ.కొండూరు మండల ఎంఈఓ ఎం.రాజశేఖర్ విద్యాభివృద్ధికి చేస్తున్నసేవలకు సత్కరించారు.ఎన్టీఆర్ జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్య దర్శి వీ.బిక్షమయ్య, జీ వరప్రసాద్‌లను సత్కరించారు.ఎస్టీయూ నాయ కులు, సభ్యులు పాల్గొన్నారు.